క్లుప్తంగా

శిరిడీ సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సద్గురు శ్రీసాయినాథుని ఆలయం శిరిడీ సాయిబాబాను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖ శాంతులతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

అయ్యప్ప పల్లకి శోభాయాత్ర

నేరడిగొండ: స్వామి శరణం.. అయ్యప్ప శరణమంటూ మండల కేంద్రంలో సోమవారం అయ్యప్ప పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. పురవీధుల గుండా స్వామి వారిని స్మరిస్తూ నృత్యం చేశారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకటరమణ, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

అంతర్గాంలో ఆధార్ ప్రత్యేక మేళా



ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామంలో సోమవారం ఆధార్ మేళా నిర్వహించారు. మండలంలోని పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఆధార్ నమోదు చేపట్టారు. ఈడీఎం బండి రవి, ఆధార్ నిర్వాహకుడు భాస్కర్ పలువురి ఆధార్ వివరాలను నమోదు చేశారు. ఆధార్ అప్‌డేట్, చిరునామా మార్పు చేపట్టారు. వృద్ధులు, చిన్నపిల్లలు వాటి సౌకర్యం కోసం ఆధార్ మేళా నిర్వహించడం జరిగిందని ఈడీఎం తెలిపారు. వారి వెంట సర్పంచ్ కపిల్ ఉన్నారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

తాంసి: భీంపూర్ మండలంలోని కమట్‌వాడలో సోమవారం స్పోర్ట్స్ కిట్లను జెడ్పీటీసీ రాజు, సర్పంచ్ లావణ్య పంపిణీ చేశారు. ప్రభుత్వం తరఫున మంజూరైన కిట్లను యువతకు అందజేశారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడ ప్రాంగణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు స్వామి, దేవిదాస్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఓవైసీని కలిసిన జిల్లా నాయకులు

ఎదులాపురం: ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీలను ఆదిలాబాద్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నిమ్మల అశోక్, ఎంఐఎం పట్టణ సంయుక్త కార్యదర్శి షకీల్ అహ్మద్, ఎండీ సుభాన్‌లు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఓవైసీకి అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు. జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న కొడప నగేశ్

ఇచ్చోడ: ఆదివాసీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం నాయకులను కోరారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో హాజరై మాట్లాడారు. విద్య, వైద్యం, రక్తహీనత, రోడ్లు, బాలకార్మికుల నిర్మూలన, పౌష్టికాహారం లోపం వంటి విషయాలపై మాట్లాడారు. టీడీఎఫ్ ఫోరం సభ్యులు దినేష్‌రెడ్డి, రణధీర్, బద్దం మురళి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

బేల: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం మాజీ దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 99వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, నాయకులు బోనిగిరివార్ గణేశ్, రామెల్లి మోరేశ్వర్, రాకేశ్, శివకుమార్, ధర్నే జీవన్, బర్కాడే రాము, పోత్రాజ్ నవీన్, కోడే ప్రదీప్, ఏబీవీపీ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ సంబురాలు

నేరడిగొండ: క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. హ్యాపీ క్రిస్మస్.. మేరీ క్రిస్మస్ అంటూ క్రైస్తవులు ఆలపించిన గీతాలు అలరించాయి. సీఎస్ఐ దక్షిణ ఇండియా సంఘం బోథ్, పొచ్చర ఫాస్టెట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అయ్యగారు జాన్‌పీటర్ పాల్గొని పలు బోధనలు చేశారు. హార్వెస్టర్, మోరియా చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుప్టి, కుమారి, గుత్పాల, తర్నం తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకట రమణ, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు పోడేటి రాజు, క్రైస్తవులు పోశెట్టి, రమేశ్, సురేశ్, క్రైస్తవులు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంతో చప్రాల గ్రామంలోని చర్చిలో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చర్చిలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆటలు, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఇంద్రశేఖర్, వాడయి వివేక్, ఠాక్రే గంభీర్, సతీష్‌పవార్, దత్తా నిక్కమ్, పాస్టర్లు మేషక్, థొలే, క్రైస్తవులు పాల్గొన్నారు.

నార్నూర్: మండలంలోని ఇందిరనగర్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పాస్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. ప్రభువు చూసిన సన్మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. చర్చిల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అరుణ్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని హోలీ ట్రినిటి చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. బిషప్ ఫాదర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఎదుట ఏర్పాటు చేసిన అగ్ని చుట్టూ ప్రార్థనలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి హోలీ ట్రినిటి చర్చి ఫాదర్ మతాయ్ వల్లపుల, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలానికి చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా క్రిస్మస్ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని చర్చిలో సర్పంచ్ సురేందర్ ప్రార్థనలు చేసి మాట్లాడారు. ప్రేమ, దయ, శాంతి మార్గాలను చూపిన ఏసుక్రీస్తు బోధన ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో పాస్టర్ సునీల్, నాయకులు సత్యనారాయణ, గోవర్ధన్, షేక్ షాకీర్, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.



నేరడిగొండ: పాస్టర్ జాన్‌పీటర్‌తో క్రైస్తవులు



ఇంద్రవెల్లి: ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



బేల: కేక్ కట్ చేస్తున్న పాస్టర్ మేషక్



నార్నూర్: ఇందిరానగర్‌లో..



ఆదిలాబాద్: హాజరైన క్రైస్తవులు



నేరడిగొండ: నృత్యం చేస్తున్న చిన్నారులు



బోథ్: మాట్లాడుతున్న సర్పంచ్ సురేందర్



ఇంద్రవెల్లి: అగ్ని చుట్టూ ప్రదక్షిణ

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- మంత్రి పొన్నం ప్రభాకర్

నేరడిగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ వైపు వెళ్తుండగా మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈనెల 28 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ తీసుకువచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తుందని, ఇందుకు గ్రామస్థాయిలో ప్రతీ నాయకుడు ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరే విధంగా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పథకాలకు అపూర్వ స్పందన ఉందని, అందుకే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా.. కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు ఆడే గజేందర్, పసుల చంటి, ప్రఫుల్‌చందర్ రెడ్డి, కుర్మే మహేందర్, బద్దం పోతారెడ్డి, కపిల్ జాదవ్, సుభాష్, శ్రీకాంత్, ఇట్టెడి రాజు రెడ్డి, బుక రాములు, బోలిశెట్టి రాములు, కుంట శంకర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

తలమడుగు: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో 200 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజులకే ప్రజలు ఆకర్షితులవుతున్నారని, గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఎంపీపీ కల్యాణ లక్ష్మి రాజేశ్వర్, వైస్ ఎంపీపీ దివ్య మాధవ్, రమేశ్ రెడ్డి, వెంకన్న యాదవ్, రమేశ్, గంగారాం, లక్ష్మణ్ రఫీ, అశోక్, లోక ప్రవీణ్ రెడ్డి, సాంబశివు నర్సింహులు పాల్గొన్నారు.

స్నేహితులు ఉంటే జీవితం ఆనందమయం

ఆదిలాబాద్: స్నేహితులు ఉంటే జీవితం ఆనందమయంగా ఉంటుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరాం రెడ్డి మెమోరియల్ హై స్కూల్ 2007–2008 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంలో సోమవారం పాల్గొన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో స్నేహితులు ఎంతో ముఖ్య పాత్ర వహిస్తారన్నారు. కష్టసుఖాల్లో ఒకరికొకరూ అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రత్నాకర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాపూర్‌లో ఎంపీ 'సోయం' పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీ సోయం బాపురావు

నార్నూర్: మండలంలోని గంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీ నిధులతో నిర్మించిన డ్రెయినేజీ పనులను సోమవారం ఎంపీ సోయం బాపురావు పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఎంపీ నిధులతో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. హైమాస్ట్ లైట్స్ ఏర్పాటు చేసేందుకు రూ. 5లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చా రు. కార్యక్రమంలో సర్పంచ్ సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, రాథోడ్ రమేశ్, మాడవి గోవింద్‌రావు, కోవ భీంరావు, గెడం గణపత్‌రావు, మెస్రం లక్ష్మణ్ పాల్గొన్నారు.

పూలాజీ బాబా చూపిన మార్గంలో నడవాలి



బాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

తలమడుగు: సద్గురు పరమహంస శ్రీ పూలాజీ బాబా చూపిన మార్గంలో నడవాలని తలమడుగు పూలాజీ బాబా ధ్యాన కమిటీ అధ్యక్షుడు కాటిపల్లి సురేశ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పూలాజీ బాబా ధ్యాన మందిరంలో పుణ్యతిథి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానం చేయడం వల్ల మానసికోల్లాసం కలుగుతుందన్నారు. బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు నీలగిరి అశోక్, రాధాబాయి. భూమన్న, మీనాక్షి, సుమాబాయ్, పొచన్న, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌పీలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు రూ. 7 కోట్ల 14 లక్షల నిధులతో జరిగిన ఉపాధిహామీ, పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ కొనసాగుతోంది. సోమవారం మండలంలోని కేస్లాగూడ, కేస్లాపూర్, ముత్నూర్, వాల్గోండ్, హీరాపూర్, వడగామ్, దనోరా(బి) గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం డీఆర్‌పీలు తమ సిబ్బందితో కలిసి గ్రామాలను సందర్శించి ఉపాధి కూలీల ఇంటికీ వెళ్లి పనులు, కూలీలకు అందిన డబ్బుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సామాజిక తనిఖీ పూర్తి అయిన వెంటనే ప్రజావేదిక నిర్వహించనున్నట్లు డీఆర్‌పీ సౌమ్య తెలిపారు.

రఘుపతిని వెంటనే అరెస్టు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మావలోని మాల సామాజిక వర్గానికి చెందిన ఎంబడి వంశీని హత్య చేసేందుకు యత్నించిన ఉమ్మం రఘుపతితో పాటు ఉమ్మం రఘు అరుంధతిని వెంటనే అరెస్ట్ చేయాలని మాల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన జిల్లా ఎస్పీతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే అరెస్ట్ చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు అల్లూరు భూమన్న, అర్క దేవిదాస్, బ్రహ్మ శ్రీనివాస్, సాయిబాబా, నిమ్మల ప్రశాంత్, ప్రకాష్, రమేశ్, సత్యనారాయణ, కిరణ్, సుదర్శన్, సురేందర్, శ్రీహరి, సంజయ్ ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

తాంసి: మండల కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. పుట్ట శివకుమార్ ఆధ్వర్యంలో గురుస్వామి జూకంటి సతీష్ మంత్రోచ్చారణల మధ్య గణపతి, అయ్యప్పస్వామి, సుబ్రమణ్య స్వామికి పూజలు చేశారు. అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తికి పంచామృతాలతో అభిషేకం చేసి పద్దెనిమిది మెట్లపై పడిని వెలిగించారు. కార్యక్రమంలో గురుస్వాములు సంతోష్, శ్రీనివాస్,రాజన్న, నరేశ్ రెడ్డి, వసంత్, తదితరులు పాల్గొన్నారు.

'భీంపూర్' దశ మారేనా?

- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు
- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- మండలాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్న ప్రజలు



అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు

తాంసి: పాలన సౌలభ్యం కోసం ఏడేళ్ల క్రితం నూతన మండలాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నూతనంగా మండలాల ఏర్పాటు చేయడంతో అభివృద్ధిపై ప్రజల ఆశలు చిగురించాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు మండలాల్లో భీంపూర్ మండలం ఒకటి. 26 పంచాయతీలతో పాటు మరికొన్ని గిరిజన గ్రామాలు ఉన్నాయి. భీంపూర్ మండలంగా ఏర్పడి ఏడేళ్లు అవుతున్నా.. అభివృద్ధికి నోచుకోవడం లేదు. మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది. మండల కేంద్రంలో కనీస వసతులు కరువయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా.. మండలం అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

అద్దె భవనాల్లోనే కార్యాలయాలు..

తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో రెండు కార్యాలయాలు ఉండడంతో సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఐకేపీ కార్యాలయం పంచాయతీ భవనంలో కొనసాగుతోంది. పోలీస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరిన ఆరోగ్య కేంద్రం కొనసాగిస్తున్నారు. వ్యవసాయశాఖ, పంచాయతీరాజ్ శాఖ కార్యాలయాలను ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. మండలంలో పూర్తిస్థాయిలో అధికారులు లేక ఇన్‌చార్జి పాలనలో కొనసాగుతోంది.

కలగానే పిప్పల్‌కోటి, గోముత్రి రిజర్వాయర్‌లు..

గత ప్రభుత్వం పిప్పల్‌కోటి, గోముత్రి రిజర్వాయర్ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీటిలో పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రారంభించి మూడేళ్లు అవుతున్నా.. పనుల్లో పురోగతి లేదు. రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందలేదు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే రైతులకు రెండు పంటలు సాగుచేసే అవకాశం ఉంటుంది.



అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి..

భీంపూర్ మండలంలోని పలు గ్రామాల గుండా వెళ్తున్న అంతర్రాష్ట్ర రహదారి భీంపూర్ నుంచి కరంజి(టి) వరకు గుంతలమయంగా మారింది. మూడేళ్లుగా గత ప్రభుత్వం మరమ్మతులు చేపట్టలేదు. రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని మండలవాసులు ధర్నా చేసిన సందర్భాలు ఉన్నాయి. రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.18కోట్లు మంజూరు చేసినా.. నేటికీ పనులు ప్రారంభం కాలేదు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా.. తమ సమస్యలను పరిష్కరిస్తుందని ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించాలి



అంతర్రాష్ట్ర రహదారి గుంతలుగా మారడంతో అవస్థలు పడుతున్నాం. గత ప్రభుత్వానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కో రినా పట్టించుకోలేదు. ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు సమస్య ను పరిష్కరిస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.

– నరేశ్‌రెడ్డి, కరంజి(టి) గ్రామం

సొంత భవనాలు నిర్మించాలి



నూతనంగా మండలం ఏర్పాటు చేసి ఏడేళ్లు అవుతున్నా.. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. దీంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– రాకేశ్‌యాదవ్, అంతర్గాం

'డీసీసీబీ పదవికి రాజీనామా చేయాలి'



మాట్లాడుతున్న పులివేణి గణేష్ యాదవ్

జైనథ్: బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన అడ్డి భోజారెడ్డి, ముందుగా డీసీసీబీ పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పులివేణి గణేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోగు రామన్న భిక్షతోనే అడ్డి భోజారెడ్డికి డీసీసీబీ చైర్మన్ పదవి దక్కిందన్నారు. కేవలం తన స్వార్థ రాజకీయాల కోసం పార్టీకి రాజీనామా చేయడం సరికాదన్నారు. తాము మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నతోనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుమాల దేవన్న, నాయకులు పూంద్రు వెంకట్ రెడ్డి, గడ్డం జగీశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ముందుగా రేషన్ కార్డులు ఇవ్వాలి'

బోథ్: రేషన్ కార్డులు మంజూరు చేసిన తరువాతనే ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి షేక్ షాకీర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోతే ఆరు గ్యారంటీ పథకాలకు చాలా మంది దూరమవుతారని, పేదలకు, అర్హులకు సంక్షేమ పథకాలను అందకుండా పోతాయన్నారు.